
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
ఆదివారం
22 నవంబర్ 2026
Follow :

# ఇటుకల శిల్పకళా వైభవం గొల్లత్త గుడి

- **వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన అపురూప జైన కట్టడం**
- **జాతీయ వారసత్వ వారోత్సవాల వేళ ప్రత్యేక కథనం**



**జడ్చర్ల, నవంబర్ 21 (జనంసాక్షి):** చారిత్రక ఆనవాళ్లకు పాలమూరు నిలయం. జాతీయ వారసత్వ వారోత్సవాల సందర్భంగా జడ్చర్ల పట్టణానికి 12 కిలోమీటర్ల దూరంలోని ఆల్వానిపల్లి శివారులో ఉన్న ప్రాచీన గొల్లత్త గుడి విశేషాలు. జైన సంప్రదాయానికి, నాటి నిర్మాణ కౌశలానికి గొల్లత్త గుడి కట్టడం నిదర్శనంగా నిలుస్తుంది.

### క్రీ.శ. 8-9 శతాబ్దాల నాటి కట్టడం...

సుమారు 1,200 ఏళ్ల క్రితం (క్రీ.శ. 7–8 శతాబ్దాల్లో) రాష్ట్రకూటులు లేదా బాదామి చాళుక్యుల కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ ప్రాంతంలో జైన మతం విస్తృతంగా వర్ధిల్లిందనడానికి ఇదే సాక్ష్యం. ఇక్కడ లభించిన మహావీర, పార్శ్వనాథ తదితర జైన శిల్పాలు మహబూబ్‌నగర్ జిల్లా మ్యూజియంలోనూ, హైదరాబాద్‌లోని రాష్ట్ర మ్యూజియంలోనూ ప్రదర్శింప బడుతున్నాయి.

### ఇటుకలతో నిర్మాణ శైలి, పర్యాటక అభివృద్ధి...

సాధారణంగా ప్రాచీన ఆలయాలను రాతితో కడ తారు. కానీ గొల్లత్త గుడిని కాల్చిన పెద్ద ఇటుకలు, సున్నపు గారతో నిర్మించారు. ఇటుకలపై లతలు, సహజ ఆకృతులు, శిల్ప కళాంశాలను చెక్కిన తీరు నాటి శిల్పుల నైపుణ్యానికి అద్దం పడుతోంది. తెలంగాణలో ఇటుకలతో నిర్మించిన అతిపెద్ద ప్రాచీన జైన కట్టడాల్లో ఇది ఒకటి. పురావస్తు శాఖ పరిధిలో ఉన్న ఈ కట్టడం పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని స్థానికులు, చరిత్ర ప్రేమికులు కోరుతున్నారు. ఈ వారసత్వ సంపదను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, ప్రజలపై ఉంది.



## రాజీమార్గం ద్వారా
# లోక్ అదాలత్ కేసుల పరిష్కారం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు**

**నారాయణపేట జిల్లా బ్యూరో నవంబర్ 21(జనంసాక్షి):** రాజీమార్గం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఎంతో సమర్థవంతమైన వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. నారా యణపేట జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కోఆర్డినేషన్ మరియు పోలీస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 12న నిర్వహించనున్న నాలు గోవ జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేసేందుకు అన్ని విభాగాల జిల్లా అధికారులు *మిగతా 11లో..*

## ఖేలో ఇండియా యూత్
# గేమ్స్-2026 పోస్టర్, లోగో, మస్కట్‌ల ఆవిష్కరన

**క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రి జూపల్లి కృష్ణారావు**



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 21 (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించనున్న 8వ ఎడిషన్ ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026కు సంబంధించి ప్రచార కార్యక్రమా లను విస్తృతంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా శనివారం కల్వకోలు గ్రామంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎక్సైజ్, ప్రొహిబి షన్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 అధికారిక పోస్టర్, లోగో, మస్కట్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెం బర్ 11 నుంచి 22వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోని ఎనిమిది ఆతిథ్య జిల్లాల్లో 20 వేదికలపై జాతీయ స్థాయి యువజన క్రీడా పోటీలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, మహ బూబ్‌నగర్, కరీంనగర్ తదితర నగరాల్లో క్రీడా పోటీలు జరగను న్నాయని పేర్కొన్నా రు. ఇప్పటికే ఈ క్రీడలకు సంబంధించిన అధికారిక లోగో, మస్కట్‌ను ఈ నెల 15న న్యూఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి ఆవిష్క రించినట్లు వివరించారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌పై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు, ముఖ్యంగా విద్యా ర్థులు, యువతకు అవగాహన కల్పించేం దుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రతి జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాల్లో అధి కారిక లోగో, మస్కట్‌తో కూడిన ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు.మాల్స్, పార్కులు, బస్‌స్టేషన్లు వంటి జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలతో పాటు కలెక్టరేట్లు, మున్సిపల్ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లు, చెరువుల కట్టలు, ఇతర ప్రముఖ బహిరంగ ప్రదేశాల్లో లోగో, మస్కట్ కటౌట్లు, స్టాండీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, యువజన సంఘాలు, క్రీడా సంఘాల భాగస్వామ్యంతో వారాంతా ల్లో మస్కట్‌తో కూడిన ఖేలో ఇండియా రన్, వాకథాన్, సైక్లోథాన్ వంటి కార్యక్రమాలను నిర్వహించి యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలని సూచించారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయ వంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధి కారులు, విద్యాసంస్థలు, సమన్వయంతో పనిచేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం కల్పించాలని మంత్రులు కోరారు.

# భద్రతా ప్రమాణాలు బేఖాతర్..

- **రోడ్లపై ప్రమాదకరంగా టైర్ల రవాణా**
- **అధికారుల మౌనంపై ప్రజల్లో అనుమానాలు**
- **పత్రికల్లో కథనాలు.. అధికారుల జరిమానాలు.. అయినా మారని తీరు**
- **టైర్ల కంపెనీల అనుమతులు, కాలుష్య నియంత్రణపై పర్యవేక్షణ ఏది?**

**కొండాపూర్, నవంబర్ 21 (జనంసాక్షి):**
మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో టైర్ల లోడ్లను కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా ప్రమాదకరంగా తరలిస్తున్నారు. వాహనాలపై అధిక లోడ్లు వేయడంతోపాటు, టైర్లు కిందపడకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గతంలో ఈ అంశంపై పలు పత్రికల్లో కథనాలు ప్రచురితమై నప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. 'జనం సాక్షి' కథనానికి స్పందించిన మండల ఎస్సై సోమేశ్వరి, నిబంధనలు పాటించని వాహనదారులకు రూ.1,100 జరిమానా విధించామని తెలిపారు జరిమానా విధించి హెచ్చరించినప్పటికీ మళ్లీ యథావిధిగా టైర్ల రవాణా కొనసాగుతుండటం గమనార్హం.

### కంపెనీలపై తనిఖీలు ఏవీ?

మండలంలో కొనసాగుతున్న టైర్ల కంపెనీలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తున్నాయా? కంపెనీల నుంచి టైర్లను తరలించే వాహనాలు నిర్ణీత బరువు పరిమితిని పాటిస్తున్నాయా? టైర్లు రోడ్డుపై పడిపోకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాయా? అనే అంశాలపై సంబంధిత శాఖల అధికారులు సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

### అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి?

పలు పర్యాయాలు పత్రికల్లో కథనాలు వచ్చినా, జరిమానాలు విధించినా పరిస్థితి మారకపోవడంతో ప్రజల్లో అనేక అను మానాలు వ్యక్తమవుతున్నాయి. కంపెనీల యాజమాన్యాలకు ఏమైనా ప్రత్యేక మినహాయింపులు ఉన్నాయా? సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ ఎందుకు చేపట్టడం లేదు? అధికారుల మౌనానికి కారణమేమిటి? అనే ప్రశ్నలు తలెత్తు తున్నాయి. అధికారులపై ముడుపుల ఆరోపణలు కూడా ప్రజల్లో చర్చకు వస్తున్న నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.






### ప్రమాదం జరిగాక కాదు.. ముందే మేల్కొనాలి!

ఇప్పటికైనా రవాణా శాఖ, పోలీస్ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సమన్వయంతో టైర్ల కంపెనీలు, రవాణా వాహనాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే కంపెనీలు, వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# దివ్యాంగ క్రీడాకారులు నవంబర్ 28లోపు పేర్లు నమోదు చేసుకోవాలి

## పారా స్పోర్ట్స్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ ప్రోగ్రామ్‌కు కలెక్టర్ పిలుపు



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 21 (జనంసాక్షి):** దివ్యాంగుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి, వారికి తగిన శిక్షణ, ప్రోత్సాహం అందించేందుకు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, ఆదిత్య మెహతా ఫౌండేషన్ సంయుక్తంగా పారా స్పోర్ట్స్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ ప్రోగ్రామ్ 2026-27 నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా ప్రతిభావంతులైన దివ్యాంగ క్రీడాకారులను గుర్తించి, వారి ఆసక్తి, శారీరక సామర్థ్యాలకు అనుగుణంగా క్రీడా విభాగాల్లో శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని తెలిపారు.

జోగులాంబ గద్వాల జిల్లాలో 12 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు కలిగిన ఆసక్తిగల దివ్యాంగులు నవంబర్ 28వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు గూగుల్ ఫారమ్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. దృష్టి వైకల్యం, చలన వైకల్యం, మేధో వైకల్యం కలిగిన వారు ఈ కార్యక్రమానికి అర్హులని తెలిపారు. అథ్లెటిక్స్, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, ఆర్చరీ, సైక్లింగ్, పవర్‌లిఫ్టింగ్, షూటింగ్, టేబుల్ టెన్నిస్, వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ తదితర పారా క్రీడల్లో ప్రతిభను గుర్తించనున్నట్లు వివరించారు.

దరఖాస్తు సమయంలో పూర్తి వ్యక్తిగత వివరాలతో పాటు యూడీఐడీ కార్డు, అభ్యర్థి ఫోటో, వైకల్యానికి సంబంధించిన ఫోటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

దరఖాస్తుల పరిశీలన అనంతరం ఎంపికైన వారికి స్క్రీనింగ్ నిర్వహించి క్రీడా సామర్థ్యాలను అంచనా వేస్తామని తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

**నమోదు లింక్:**
గూగుల్ ఫారమ్ ద్వారా పేర్లు నమోదు చేసుకోండి

# ఇందిరమ్మ కుటుంబ బీమాకు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి



**ఖిల్లా ఘనపురం, నవంబర్ 21 (జనంసాక్షి):** పేద కుటుంబాలకు రూ.5 లక్షల బీమా రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి అర్హులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో విజయ్ సింహారెడ్డి సూచించారు. శనివారం ఖిల్లా ఘనపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆగారం పద్మమ్మ ప్రకాష్‌తో కలిసి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నవంబర్ 19 నుంచి డిసెంబర్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శులు, సర్పంచులు ప్రజలకు అవగాహన కల్పించి అర్హులందరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# సీవీ రామన్‌కు ఘన నివాళులు



**అడ్డాకుల, నవంబర్ 21 (జనంసాక్షి):** సీవీ రామన్ వర్ధంతి సందర్భంగా అడ్డాకుల మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ వి. ప్రకాష్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణతో ప్రపంచవ్యాప్తంగా భారతదేశానికి గుర్తింపు తెచ్చిన గొప్ప శాస్త్రవేత్త సీవీ రామన్ అని కొనియాడారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో
# జీనియస్ స్కూల్‌కు ప్రథమ ర్యాంక్



**సదాశివపేట, నవంబర్ 21 (జనంసాక్షి):** మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్-2026లో జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు ఎం. రోహన్ రెడ్డి, ఖాజా మొయినుద్దీన్, మెహెర్ ఉన్నిసా ప్రథమ ర్యాంక్ సాధించారు.

విజేతలకు ఎంఈఓ శంకర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

## సిలిండర్ పేలి గుడిసె దగ్ధం...
# కట్టుబట్టలతో మిగిలిన కుటుంబం

## బండరాయిపాకులలో బాధిత కుటుంబానికి తక్షణసహాయం అందజేసిన ప్రజాప్రతినిధులు



**రేవల్లి, నవంబర్ 21 (జనంసాక్షి):** రేవల్లి మండలంలోని బండరాయి పాకుల గ్రామంలో నల్లపోతుల శ్రీలత తండ్రి అర్జునయ్య ప్రమాదవశాత్తు గుడిసెలో సిలిండర్ పేలి గుడిసె పూర్తిగా దగ్ధమైంది.

ఈ ప్రమాదంలో కుటుంబానికి కట్టుబట్టలు మాత్రమే మిగిలాయి. ఈ విషయం తెలియగానే స్థానిక రేవల్లి మండల ఎంఆర్ఓతో పాటు బండరాయపాకల గ్రామ సర్పంచ్ ధూపం రాజు, ఉప సర్పంచ్ దేసాని సుకుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ దాసు బాలస్వామి, మిద్దె స్వామి తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా తక్షణ సహాయం కింద గ్రామ సర్పంచ్ ధూపం రాజు 1 క్వింటాలు బియ్యం, ఉప సర్పంచ్ దేసాని సుకుమార్ రెడ్డి 5,000, మాజీ సర్పంచ్ దాసు బాలస్వామి 5,000, మిద్దె స్వామి 1,500 అందజేశారు. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకోవడానికి గ్రామంలోని నాయకులు, ప్రజలు, దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా

- ఇందిరమ్మ బీమా పథకంపై గ్రామసభలో అవగాహన




**కంట్టి, నవంబర్ 21 (జనంసాక్షి):** రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యమని ఎంపీడీవో సుభాష్ చంద్రగౌడ్ తెలిపారు. కంట్టి మండలం భీమ్రా గ్రామపంచాయతీలో సర్పంచ్ బాబు అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఈ పథకం అండగా నిలుస్తుందని వివరించారు. ప్రజలు పథకంపై అవగాహన పెంచుకొని అర్హత వివరాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ బస్వరాజ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# పాలమూరు ప్రతిభ పరీక్ష
# విజేతలకు బహుమతుల ప్రదానం



**ఖిల్లా ఘనపురం, నవంబర్ 21 (జనంసాక్షి):** పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం ఆధ్వర్యంలో మండలంలోని 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పాలమూరు ప్రతిభ పరీక్ష విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి జయశంకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, పోటీతత్వం పెంపొందించేందుకు పరీక్ష నిర్వహించడం అభినందనీయమన్నారు. మండలవ్యాప్తంగా 172 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, ప్రతి తరగతి నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన 12 మందిని ఎంపిక చేశారు. ప్రథమ బహుమతిగా రూ.300, ద్వితీయ బహుమతిగా రూ.200 నగదుతో పాటు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. పాల్గొన్న అందరికీ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఈనెల 25న సిద్దిపేటకు బిజెపి జాతీయ అధ్యక్షులు రాక

- పాదయాత్రను విజయవంతం చేయాలి
- జిల్లా బిజెపి అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్



**మెదక్ బ్యూరో, నవంబర్ 21 (జనంసాక్షి):** ఈనెల 25న సిద్దిపేటకు రానున్న బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షులు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ జేపీ నడ్డా పాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా బీజేపీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ అన్నారు. జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ అధ్యక్షతన జిల్లా స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈనెల 25వ తేదీన బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షులు, ప్రస్తుత కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పట్టణానికి విచ్చేయనున్న నేపథ్యంలో, మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవ నేని రఘునందన్ రావు సూచన మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ పదాధికారులు, మండల అధ్యక్షులు, బీజేపీ సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు మరియు ముఖ్య నాయకులతో కార్యక్రమ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ, ఈనెల 25వ తేదీన సిద్దిపేటలో జరగనున్న జేపీ నడ్డా పాదయాత్ర కార్యక్రమానికి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి మండలం నుంచి, ప్రతి గ్రామం నుంచి భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ అధిక సంఖ్యలో ప్రజలను సమీకరించాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శులు ఈర్ల రంజిత్ రెడ్డి, సీహెచ్ శ్రీనివాస్, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ రాగి రాములు, మహిళా మోర్చా నాయకురాలు శైలజ, బీజేపీ కార్యవర్గ సభ్యులు లోకపోయిన లోకేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు వడ్ల జనార్ధన్, యువమోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ఎస్టీ మోర్చా అధ్యక్షులు రాములు నాయక్, మైనార్టీ మోర్చా అధ్యక్షులు జ్ఞాన్ సింగ్, మండల అధ్యక్షులు నవీన్ గౌడ్, సిద్ధిరాం రెడ్డి, ప్రధాన కార్యదర్శులు శ్యాంసుందర్, దశరథ్ బాబు, సతీష్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అయ్యప్ప ఆలయంలో
# వైభవంగా ప్రతిష్ట పూజలు



**అమీన్‌పూర్, నవంబర్ 21 (జనంసాక్షి):** బీరంగూడ గుట్టపై నూతనంగా నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం నుంచి వేదపారాయణం, గోపూజ, శ్రీ రుద్ర హోమం, అయ్యప్ప స్వామివారి మూల మంత్ర హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అయ్యప్ప భక్తుడు భరత్ కుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శనివారం అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం జరిగే విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కొల్లూరి మల్లేశం కోరారు.

## ప్రతి కుటుంబం ఇందిరమ్మ జీవిత బీమా నమోదు చేసుకోవాలి

• కౌన్సిలర్ పట్లూరి రోజా నాగరాజు గౌడ్



**సదాశివపేట, నవంబర్ 21(జనంసాక్షి):** పట్టణంలోని 19వ వార్డులో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ పట్లూరి రోజా నాగరాజు గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేషన్ కార్డులో పేరుండి, 18 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు కలిగిన ప్రతి కుటుంబ సభ్యుడు ఈ పథకానికి అర్హులని తెలిపారు. పథకం ఉద్దేశాలు, ప్రయోజనాలను ప్రజలకు వివరించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. నెల రోజుల పాటు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, 19వ వార్డులోని అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ మన్మోహన్, సతీష్ కుమార్, ఆర్‌పీ ఉమా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజు గౌడ్, సలీం పాల్గొన్నారు.

## చెకుముకి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు

**కొండపాక, నవంబర్ 21 (జనంసాక్షి):** కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో చెకుముకి, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ బచ్చలి సత్తయ్య ప్రశంసా పత్రాలు అందజేశారు. భవ్యశ్రీ, కారుణ్య, సూర్యప్రకాశ్ రెడ్డి, తన్వి, హేమలత వివిధ స్థాయిల్లో ప్రతిభ చూపి విజయం సాధించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ విద్యా, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమలత, బాలకిషన్, రాజయ్య, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**శివ్వంపేట, నవంబర్ 21 (జనంసాక్షి):** ముప్పిరెడ్డిపల్లికి చెందిన శశిధర్, తేజశ్రీల వివాహం శనివారం కొంపల్లి ఎమ్మెస్సార్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సర్పంచ్ కల్లూరి హన్మంత్ రావు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అట్టహాసంగా జెండా ఆవిష్కరణ



**పాపన్నపేట, నవంబర్ 21 (జనంసాక్షి) :** ప్రపంచ మత్స్య, ముదిరాజ్ ఐక్యత దినోత్సవం అట్టహాసంగా జరిగింది. శనివారం పాపన్నపేటలో ముదిరాజ్ సంఘము సభ్యులు జెండా ఆవిష్కరణ చేశారు. మండలాధ్యక్షుడు ముశెట్టి కిష్టయ్య,పట్టణ అధ్యక్షుడు మాణయ్య, సభ్యులు వెంకటేశం, విట్టల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా

• పెద్దగూడెం నుంచి వనపర్తి జిల్లావ్యాప్తంగా ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం
• అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి - ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
• పెద్దగూడెంను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం - రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి



**వనపర్తి, నవంబర్ 21 (జనంసాక్షి):** కుటుంబ పెద్దను కోల్పోయినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకాన్ని వనపర్తి జిల్లాలో శనివారం ప్రారంభించారు. పెద్దగూడెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కొత్తకాపు శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ..** జిల్లాలోని 268 గ్రామపంచాయతీలు, 80 మున్సిపల్ వార్డుల్లో నమోదు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రైతు బీమా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. వనపర్తి నియోజకవర్గానికి 5,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, పెద్దగూడెంకు 62 ఇళ్లు కేటాయించినట్లు వెల్లడించారు. అర్హులందరూ కుటుంబ బీమా పథకంలో నమోదు చేసుకోవాలని కోరారు.

**కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ..** 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ పథకానికి అర్హులని తెలిపారు. కుటుంబ పెద్ద మరణిస్తే నామినీకి రూ.5 లక్షల బీమా పరిహారం అందుతుందని వివరించారు. నమోదు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో జరుగుతుందని, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రతిరోజూ 50 కుటుంబాల చొప్పున నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.





**రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ..** భూమి ఉన్న రైతులకే కాకుండా భూమిలేని నిరుపేద కుటుంబాలకు సైతం బీమా భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. పెద్దగూడెంలో సుమారు 950 కుటుంబాలు ఉన్నాయని, గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. గ్రామంలో డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు అందేలా కృషి చేస్తామని తెలిపారు.



అనంతరం ఐదుగురు కుటుంబ సభ్యులకు బీమా నమోదు పత్రాలను అందజేశారు. ఇందిరమ్మ ప్రచార కరపత్రంతో పాటు ఖోఖో ఇండియా పోటీల గోడపత్రిక, మస్కట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, మున్సిపల్ చైర్మన్లు మాధవి, శ్రీనివాస్ గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దళిత కాలనీ స్థల వివాదంపై డీఎల్పీఓకు వినతి



**చేర్యాల, నవంబర్ 21 (జనంసాక్షి):** చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి దళిత కాలనీలో 40 ఏళ్లుగా దళితుల ఆధీనంలో ఉన్న స్థల వివాదంపై కాలనీవాసులు శనివారం డీఎల్పీఓకు వినతిపత్రం అందజేశారు. కాలనీలోని పాత రేకుల షెడ్డు శిథిలావస్థకు చేరడంతో దానిని తొలగించి పునర్నిర్మాణం చేపట్టేందుకు గ్రామపంచాయతీ తీర్మానం ఇవ్వాలని కోరగా సర్పంచ్ మెడబోయిన కుమార్ నిరాకరిస్తున్నారని ఆరోపించారు. స్థలాన్ని పంచాయతీలో కలుపుకుంటామని ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. పంచాయతీలోని 10 మంది వార్డు సభ్యుల్లో 8 మంది దళితులకు మద్దతుగా తీర్మానంపై సంతకాలు చేసినప్పటికీ సర్పంచ్, కార్యదర్శి కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. డీఎల్పీఓకు సమస్య వివరించి న్యాయం చేయాలని కోరారు. ఎనిమిది మంది వార్డు సభ్యులు కూడా తమ మద్దతు తెలిపారు. నిర్మాణానికి అనుమతులు, తీర్మానం ఇప్పించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

## మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

• బెజ్జంకి మండల అధ్యక్షుడు అక్కరవేని పోచయ్య డిమాండ్



**బెజ్జంకి, నవంబర్ 21 (జనంసాక్షి):** ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మత్స్యకారులకు అక్కరవేని పోచయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థిక, సామాజిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వలలు, రక్షణ బోట్లు, ఐస్ బాక్సులు సబ్సిడీపై అందించాలని, చేపల మార్కెట్లలో కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. మత్స్యకారుల పిల్లలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని, ముదిరాజ్ వర్గీకరణ పెండింగ్ డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని అక్కరవేని పోచయ్య డిమాండ్ చేశారు.

## వివాహిత మహిళ అదృశ్యం.. పోలీసుల గాలింపు




**ఉప్పునుంతల, నవంబర్ 21 (జనంసాక్షి):** ఉప్పునుంతల పోలీస్ స్టేషన్ పరిధిలో ర్యాపాని అంకిత (21) అనే వివాహిత మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై పుట్ట మహేష్ తెలిపారు. ఈ నెల 13న ఉమామహేశ్వరం దేవస్థానంలో కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో ఆమె వివాహం జరిగింది. ఈ నెల 20న భర్తతో కలిసి డిండి చింతపల్లి బ్రిడ్జి వద్దకు వెళ్లి ఇంటికి తిరిగివచ్చారు. అనంతరం డబ్బులు పోయాయని, వెతికి వస్తానని చెప్పి బయటకు వెళ్లిన అంకిత తిరిగి రాలేదు. బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదుతో ఈ నెల 21న కేసు నమోదు చేసి పోలీసులు గాలింపు చేపట్టారు.

## మాస్టర్ మైండ్స్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 21 (జనంసాక్షి):** బిజినపల్లిలోని మాస్టర్ మైండ్స్ పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, కలెక్టర్, ఎంఈఓ, డీఈఓ తదితర పాత్రలు పోషిస్తూ పాఠాలు బోధించి, పాఠశాల నిర్వహణలో భాగస్వాముల య్యారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందడంతో పాటు ఉపాధ్యాయుల బాధ్యతలపై అవగాహన కలిగిందని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

## 22వ వార్డులో ఇందిరమ్మ కుటుంబ బీమా నమోదు ప్రారంభం



**సదాశివపేట, నవంబర్ 21 (జనంసాక్షి):** సదాశివపేట పట్టణంలోని 22వ వార్డులో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని కౌన్సిలర్ గారెల గౌరీదేవి తుల్జారాం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు కలిగి, 18 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్న అర్హులైన ప్రతి ఒక్కరూ పథకంలో నమోదు చేసుకొని ప్రభుత్వ బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అదనపు కలెక్టర్‌గా పి.కృష్ణ పూర్తి అదనపు బాధ్యతల స్వీకరణ



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 21 (జనంసాక్షి);** జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ గా పి.కృష్ణ పూర్తి అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ, అప్పగించిన బాధ్యతలను పూర్తి అంకితభావంతో, నిబద్ధతో, సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి స్థానిక సంస్థలు ఎంతో కీలకమని, ఈ దిశగా మరింత సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.గ్రామ పంచాయతీలు,మండల పరిషత్‌లు, మున్సిపాలిటీల పరిధిలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు.గ్రామ పంచాయతీల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ సేవలను మెరుగుపరచడం, పారిశుధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం, తాగునీటి సమస్యల పరిష్కారం, రహదారులు,డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి,ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో చేరేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని చెప్పారు.గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల పరిధిలో చేపడుతున్న పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దిష్ట సమయంలో పనులు పూర్తయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ స్థానిక సంస్థల పనితీరును పరిశీలించడంతో పాటు, ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని తెలిపారు. జిల్లా అభివృద్ధి లక్ష్యాల సాధనలో తనకు అప్పగించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని పి.కృష్ణ ఈ సందర్భంగా వెల్లడించారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేసిన
## మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



**కల్హేర్, నవంబర్ 21 (జనంసాక్షి):** కల్హేర్ మండలం ఖానాపూర్ (కే) గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న మొగులూరి బేబికి రూ.8,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి శనివారం అందజేశారు. లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చేర్యాల ఇంటిగ్రేటెడ్
## బిల్డింగ్ కాంప్లెక్స్‌లో చోరి



**చేర్యాల నవంబర్ 21 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ కాంప్లెక్స్ లో శుక్రవారం రాత్రి చోరీ జరిగిందని సూపర్వైజర్ ధర్మరాజు తెలిపారు. గదుల తాళాలు పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు సుమారు రూ.5 లక్షల విలువైన కరెంట్ వైర్లను ఎత్తుకెళ్లారని చేర్యాల పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఏళ్ల కాలంగా నిలిచిపోయిన ఈ భవనాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని మండలప్రజలు కోరుతున్నారు.

### నూతన గృహప్రవేశ వేడుకలో
## పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**ఖిల్లా ఘనపురం, నవంబర్ 21 (జనంసాక్షి):** మండలంలోని వెంకటంపల్లి గ్రామానికి చెందిన దేవర్శెట్టి ఆంజనేయులు నూతన గృహప్రవేశ వేడుకలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆగారం ప్రకాష్, జ్యోతి దంపతులు శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి, వారు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

### జిల్లాస్థాయి క్విజ్ పోటీలలో శ్రీరంగాపురం విద్యార్థిని ప్రథమ స్థానం

- **50కి 49 మార్కులు సాధించిన కుమారి షిజా**
- **ఆర్డీవో చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న విద్యార్థిని**



**శ్రీరంగాపురం, నవంబర్ 21 (జనంసాక్షి):** ఎలక్ట్రరల్ లిటరసీ క్లబ్, వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శ్రీరంగాపురంకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని కుమారి షిజా జిల్లా ఉత్తమ స్థాయిలో 49/50 మార్కులు సాధించి మొదటి శ్రేణిలో నిలిచింది.
జిల్లా ఎన్నికల అధికారులు అయిన ఆర్డీవో శ్రీ సుబ్రహ్మణ్యం, శ్రీ రామ్ రెడ్డి, శ్రీ సుధీర్ రెడ్డి చేతుల మీదుగా ఆమె ప్రశంసా పత్రాన్ని అందుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఇ.జ్యోతి, సాంఘిక పాఠశాల ఉపాధ్యాయిని శ్రీమతి సి.బుచ్చమ్మ, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థిని షిజాను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు అభినందించారు.

### మాన్య నాయక్
## మరణం పార్టీకి తీరని లోటు

- **మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన బీఆర్ఎస్ నాయకులు**



**ఉప్పునుంతల,(జనంసాక్షి):**మండలంలోని గుట్టమీద తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ మాన్య నాయక్ మరణం పార్టీకి తీరని లోటని మండల అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కట్ట గోపాల్ రెడ్డి అన్నారు. శనివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ కోసం మాన్య నాయక్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. అనంతరం కుటుంబానికి ఆర్థిక సాయం అందించి, బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్లయ్య యాదవ్, సుధాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో యువతలో ప్రతిభకు పదును!




- **ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదినం సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్**
- **కల్వకుర్తి జట్టుకు రూ.25 వేల ప్రథమ బహుమతి**

**కల్వకుర్తి, నవంబర్ 21 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీల నిర్వహణతో యువతలో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జైపాల్ యాదవ్, ఉప్పల వెంకటేష్ హాజరై విజేత జట్లకు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్‌లో కల్వకుర్తి 11 జట్టు ప్రథమ స్థానం, జీడిపల్లి జాగ్వార్ జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. విజేత కల్వకుర్తి జట్టుకు ప్రముఖ సంఘసేవకుడు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకుడు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము రూ.25 వేల నగదు బహుమతిని అందజేశారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, సమష్టి భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులకు సరైన అవకాశాలు, ప్రోత్సాహం కల్పిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తారని అన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు.




ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామీణ యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాలని, క్రీడాస్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో ఆమనగల్ కౌన్సిలర్ రామన్న, రైతు మండలి సభ్యులు శ్రీను నాయక్, పరుశురాం నాయక్, రాకేష్, ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, స్పేరో టీం సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

### మహ్మదాపూర్ అమరవీరుల
## త్యాగాలకు సముచిత గౌరవం

**కోహెడ, నవంబర్ 21 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల స్మృతివనం ఏర్పాటుకు మహ్మదాపూర్ గుట్టల్లో ప్రభుత్వం రూ.2.30 కోట్ల నిధులు విడుదల చేయడంపై అమరవీరుల కుటుంబ సభ్యుడు, కోహెడ మండల జేఏసీ చైర్మన్ డాక్టర్ తూమోజు జగదీశ్వరాచారి హర్షం వ్యక్తం చేశారు. 79 ఏళ్ల తమ చిరకాల ఆకాంక్ష నెరవేర్చిన ప్రభుత్వానికి, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అమరవీరుల చరిత్రను, త్యాగాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కోరారు.

## ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై ఎంపీడీవో తనిఖీ



**ఉప్పునుంతల, నవంబర్ 21 (జనంసాక్షి):** ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు తీరును పరిశీలించేందుకు ఎంపీడీవో వరుణ్ తేజ్ శనివారం మండలంలోని వెల్టూరు, కంసానిపల్లి గ్రామపంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా పథకం నమోదు ప్రక్రియ, సిబ్బంది పనితీరును పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, నమోదు ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు పథకంపై పూర్తి అవగాహన కల్పిస్తూ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజలు కూడా అధికారులకు సహకరించి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెల్టూరు సర్పంచ్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ - 2027 జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

- జిల్లా యువజన, క్రీడల అధికారి రామలింగేశ్వర గౌడ్



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 21 (జనంసాక్షి);** జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు, 30వ జాతీయ యువజ నోత్సవం -2027లో భాగంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమానికి సంబంధించి జోగులాంబ గద్వాల జిల్లాలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలను ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి తోటకూర రామలింగేశ్వర గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ ఎంపిక పోటీలు నవంబర్ 25, 2026 (బుధవారం) ఉదయం 10.00 గంటలకు గద్వాల పట్టణంలోని నదీ అగ్రహారం PG సెంటర్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, కళాత్మక ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసి ప్రోత్సహించే లక్ష్యంతో జానపద నృత్యం, జానపద గానం, చిత్రలేఖనం, వీధి నాటకం, కవితా రచన తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అర్హులైన యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని, మై భారత్ పోర్టల్‌లో ఇప్పటికే నమోదు చేసుకున్న వారితో పాటు ఇంకా నమోదు చేసుకోని వారు కూడా నేరుగా పోటీలు జరిగే ప్రదేశానికి హాజరై తమ పేర్లను నమోదు చేసుకొని పాల్గొనవచ్చని స్పష్టం చేశారు. ఈ ఎంపిక పోటీలను మై భారత్ కోఆర్డినేటర్ మరియు భారత ప్రభుత్వ జిల్లా యువజన అధికారి కోట నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడంతో పాటు జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనే దిశగా ముందడుగు వేయాలని జిల్లా యువజన, క్రీడల అధికారి రామలింగేశ్వర గౌడ్ కోరారు.

## ప్రీ ప్రైమరీ సిబ్బంది సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలి

- ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలి
- ధర్మ సమాజ్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల సురేష్ మహారాజ్



**బెజ్జంకి, నవంబర్ 21 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు,ఆయాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని శనివారం ధర్మ సమాజ్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల సురేష్ మహారాజ్ డిమాండ్ చేశారు.గత ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని, నెలకు రూ.26 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రతతో పాటు పీఎఫ్,ఈఎస్ఐ,బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు.ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఈ రంగంలో అధికంగా బీసీ,ఎస్సీ,ఎస్టీ వర్గాలకు చెందిన విద్యావంతులు సేవలందిస్తున్నారని,వారి సమస్యల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడటం సరైంది కాదని విమర్శించారు.పనిచేసిన గంట లకు అనుగుణంగా వేతనాలు చెల్లించడంతో పాటు 12 నెలల వేతనాలు,సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ నెల 23న కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు,ఆయాలు నిర్వహించనున్న ధర్నాకు ధర్మ సమాజ్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు.ప్రభుత్వం వెంటనే స్పందించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

## కొల్చారం జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలి

- కళాశాలను సందర్శించిన యుఎస్ఎఫ్ఐ నాయకులు



**కొల్చారం, నవంబర్ 21 (జనంసాక్షి):** కొల్చారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. కళాశాలను యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్, వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్ సందర్శించి కళాశాలలోని సమస్యలను పరిశీలించారు.

**ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..** కళాశాలలో అనేక సమస్యలు నెలకొన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లినా స్పందన లేకుండా పోతోందని ఆరోపించారు. కళాశాలలో తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కళాశాల మైదానంలో చెత్తాచెదారం, రాళ్లగుట్టలు పేరుకుపోవడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా వాష్ రూమ్‌ల నిర్వహణ సరిగా లేకపోవడం కూడా విద్యార్థులకు ఇబ్బందిగా మారిందన్నారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను అధికారులు ఇప్పటికైనా గుర్తించి తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కమిటీ సభ్యులు తేజ, వంశీ, కృష్ణ పాల్గొన్నారు.

## పేదల ప్లాట్లలోకి మాస్టర్ ప్లాన్ రోడ్డు!

- అక్రమ నిర్మాణాలను వదిలి పేదల భూములపైనే మున్సిపల్ అధికారుల ప్రతాపమా?



**సదాశివపేట, నవంబర్ 21 (జనంసాక్షి):**
పట్టణంలోని 8వ వార్డు హనుమాన్‌నగర్‌లో పేదల ప్రైవేట్ ప్లాట్ల నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టడంపై టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వేణుమాధవ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 1982లో కొనుగోలు చేసిన వెంచర్‌లో గతంలో 12 అడుగుల రోడ్డు ఉండగా, మాస్టర్ ప్లాన్ పేరుతో 68వ నంబర్ ప్లాట్‌ను పూర్తిగా రోడ్డులో కలపడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సర్వే నంబర్ 489లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోకుండా, పేదల సొంత ప్లాట్లను లక్ష్యంగా చేసుకోవడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరోపించారు.

ప్లాట్ యజమానులకు న్యాయం చేయాలని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వేణుమాధవ్ డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే హైకోర్టును ఆశ్రయిస్తామని, ఇప్పటికే పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## జలసిరితో భూగర్భ జలాల సంరక్షణకు చర్యలు

### గడ్డంపల్లిలో ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం.. తాగునీటి నాణ్యతపై అవగాహన

**తెలకపల్లి, నవంబర్ 21 (జనంసాక్షి):** తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గడ్డంపల్లి గ్రామంలో వర్షపు నీటి సంరక్షణ, స్వచ్ఛమైన తాగునీటి వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వెన్నెల శేఖర్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు.



**శనివారం ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..** వర్షపు నీటిని వృథా కాకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకేలా చేయడం వల్ల భూగర్భ జలమట్టం పెరుగుతుందని, భవిష్యత్తులో నీటి కొరతను నివారించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం మిషన్ భగీరథ ఏఈ శివశంకర్ గ్రామ ప్రజలకు తాగునీటి నాణ్యత, పీహెచ్ స్థాయిల ప్రాముఖ్యత, శుద్ధి చేసిన నీటి వినియోగం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. సురక్షితమైన తాగునీటిని వినియోగించే విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నీటి సంరక్షణ ప్రాముఖ్యతను వివరించిన ఏఈ శివశంకర్‌కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.




## మొబైల్ గేమ్స్ ఆడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి: సీఐ వెంకట్ రెడ్డి



**కంగ్టి, నవంబర్ 21 (జనంసాక్షి):**
మొబైల్ ఫోన్లలో లూడోతో పాటు ఇతర ఆన్‌లైన్ గేమ్స్ ఆడేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కంగ్టి సీఐ వెంకట్ రెడ్డి సూచించారు. గేమ్స్ మధ్యలో వచ్చే ప్రకటనల ద్వారా సైబర్ మోసాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. 'మీరు గెలిచారు', 'బహుమతి పొందండి' అంటూ వచ్చే ప్రకటనలు, తెలియని లింకులపై క్లిక్ చేయవద్దన్నారు. అనుమానాస్పద ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయడం వల్ల వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్లకు చేరే ప్రమాదం ఉందన్నారు. ఫోన్‌లో ఎవరైనా ఓటీపీ అడిగినా చెప్పవద్దని, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత ఫొటోలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద సందేశాలు, ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పేదలకు సీఎంఆర్ఎఫ్‌తో ఆర్థిక భరోసా...

- సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సరిత
- బాధితురాలికి రూ.2.50 లక్షల ఎల్‌వోసీ అందించిన బండ్ల జ్యోతి



**గద్వాల, నవంబర్ 21(జనంసాక్షి):**ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేద కుటుంబాలకు వైద్య ఖర్చుల విషయంలో ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ సరిత అన్నారు. శనివారం గద్వాల నియోజకవర్గంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడే పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.



మరో కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే సతీమణి, మాజీ సర్పంచ్ బండ్ల జ్యోతి లతిపురం గ్రామానికి చెందిన ఆవుల రాధ వైద్య చికిత్స కోసం మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌వోసీని కుటుంబ సభ్యులకు అందజేశారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందని తెలిపారు. అర్హులైన వారు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, సర్పంచ్ రాముడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, విధి సామర్థ్యాన్ని పెంచేందుకే వీక్లీ పరేడ్: విజయ్ భాస్కర్



**నారాయణపేట, నవంబర్ 21(జనంసాక్షి):** పోలీసు సిబ్బందిలో క్రమ శిక్షణ,విధి నిర్వహ ణలో సామర్థ్యం పెంచేం దుకు వీక్లీ పరేడ్ నిర్వహి స్తున్నట్లు ఆర్ ఐ విజయ భాస్కర్ అన్నారు.జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు, సివిల్ పోలీసులు, హోంగార్డులకు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో వీక్లీ పరేడ్ నిర్వహించారు.ఈ పరేడ్‌లో భాగంగా పోలీస్ సిబ్బందికి ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్, వెపన్ డ్రిల్ తదితర కవాతు విన్యా సాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది శారీర క దృఢత్వం, క్రమశిక్షణ, సమన్వయం, విధి నిర్వహ ణలో అప్రమత్తతను పెంపొందించుకోవాలని సూచించారు. పోలీస్ విధుల్లో సమయపాలన, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్య తనిస్తూ ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. వీక్లీ పరేడ్‌లు పోలీస్ సిబ్బందిలో క్రమ శిక్షణ, శారీరక దృఢత్వం, విధి నిర్వహణ నైపుణ్యా లను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ శంకర్, పోలీసు సిబంది పాల్గొన్నారు.

# చెక్ బౌన్స్ కేసులకు రాజీతో శాశ్వత పరిష్కారం

**ఇరువర్గాలు పంతాలకు పోకుండా సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలి: న్యాయమూర్తి ఎం. హేమలత**

**నర్సాపూర్, నవంబర్ 21 (జనంసాక్షి):** చెక్ బౌన్స్ కేసుల్లో ఇరువర్గాలు పరస్పర అంగీకారంతో రాజీ కుదుర్చుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని నర్సాపూర్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఎం. హేమలత సూచించారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ పంతాలకు పోవడం వల్ల విలువైన సమయం, డబ్బు వృథా అవుతాయని, పరస్పర చర్చల ద్వారా వివాదాలకు పరిష్కారం కనుగొనాలని పేర్కొన్నారు.జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనలతో మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నర్సాపూర్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ (ఎన్ఐ) చట్టం కింద నమోదైన చెక్ బౌన్స్ కేసుల్లో కక్షిదారు లు పరస్పర అవగాహనతో ముందుకొచ్చి రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు.




ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సులభ తరంగా కేసులను పరిష్కరించుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించు కోవడం వల్ల ఇరువర్గాలకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు న్యాయపరమైన ఇబ్బందులు తగ్గుతాయని వివరించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ సహాయ న్యాయవాది డి. శ్రీధర్‌రెడ్డి, మాజీ ఏజీపీ ఈ. సత్యనారాయణ, పి. సుధాకర్, సీనియర్ న్యాయవాది జాఫర్, ఏ. శ్రీనివాస్, న్యాయవాదులు ప్రభు, రవి నాయక్, రాధాబాయి, లీగల్ సర్వీసెస్, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి బంగారం ఎక్కడ?

- **బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బాలవర్ధన్ గౌడ్**



**జడ్చర్ల, నవంబర్ 21 (జనంసాక్షి):** జడ్చర్ల అంబేద్కర్ కళాభవనంలో 92 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, ఒక్కొక్కరికి తులం చొప్పున ఇవ్వాల్సిన 92 తులాల బంగారం ఎక్కడుందో చెప్పాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్ గౌడ్ శనివారం మీడియా ప్రకటనలో డిమాండ్ చేశారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్, బీజేపీ ఏం చేశాయని ఎమ్మెల్యే విమర్శించడం దురదృష్టకరమన్నారు. ఇద్దరు నేతలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఎవరి గురించో జడ్చర్ల ప్రజలకు అర్థమైందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే జడ్చర్ల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు.

## ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి

- **అర్హులందరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి**
- **బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎర్రోళ్ల రవి డిమాండ్**



**కొండాపూర్, నవంబర్ 21 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎర్రోళ్ల రవి డిమాండ్ చేశారు. ఆసరా పెన్షన్లను పెంచడంతో పాటు అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు.
గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పెన్షన్లు పెంచి పేదలకు ఆర్థిక భరోసా కల్పించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని, పెన్షన్ల పెంపు అత్యవసరమని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలన్నింటినీ జాప్యం చేయకుండా అమలు చేయాలని కోరారు. కొత్త పెన్షన్ల దరఖాస్తుల కోసం ప్రారంభించిన వెబ్‌సైట్‌ను వారం, పది రోజులకే మూసివేయడంతో చాలామంది అర్హులు దరఖాస్తు చేసుకోలేక పోయారని తెలిపారు. వెంటనే వెబ్‌సైట్‌ను తిరిగి ప్రారంభించి అర్హులందరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని, ఎన్నికలలో పెన్షన్ పెంపు పై ఇచ్చిన హామీ మేరకు పెంచి లబ్ధిదారులకు అందించాలని ఎర్రోళ్ల రవి, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఎఫ్‌పీజీపీ నైపుణ్యాలు

- **బీవీఆర్ఐటీలో 'ఎఫ్‌పీజీపీ కనెక్ట్-2026' సమ్మేళనం**



**నర్సాపూర్, నవంబర్ 21 (జనంసాక్షి):** పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని పలువురు ప్రముఖులు సూచించారు. బి.వి. రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ)లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగం ఆధ్వర్యంలో శనివారం 'ఎఫ్‌పీజీఏ కనెక్ట్-2026' పేరుతో పరిశ్రమ-విద్యాసంస్థల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎండీ అడాప్టివ్ అండ్ ఎంబెడెడ్ కంప్యూటింగ్ గ్రూప్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ చురివాలా ముఖ్య అతిథిగా, వానిక్స్ టెక్నాలజీస్ సహ వ్యవస్థాపకులు, సీటీవో డాక్టర్ ముద్దసాని సత్యనారాయణ విశిష్ట అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఎఫ్‌పీజీఏ సాంకేతికతలో వస్తున్న నూతన ఆవిష్కరణలు, పారిశ్రామిక రంగంలో వాటి వినియోగం, భవిష్యత్తులో అందుబాటులోకి రానున్న అవకాశాలపై నిపుణులు తమ అనుభవాలను, అభిప్రాయాలను పంచుకున్నారు. మైక్రోచిప్, ఇంటెల్, లాటిస్ సెమీకండక్టర్ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొని సాంకేతిక అంశాలపై చర్చించారు.
కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీపతి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సంజీవరెడ్డి, డీన్-ఇన్నోవేషన్ డాక్టర్ ఎం.సి. చిన్నయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
పరిశ్రమలు కోరుకుంటున్న నైపుణ్యాలను విద్యార్థులకు అందించడంతోపాటు వారిలో పరిశోధనా దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇలాంటి సమ్మేళనాలు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.
కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన అతిథులు, వివిధ సంస్థల ప్రతినిధులు, అధ్యాపకులు, సిబ్బందికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభించిన సర్పంచ్

- **ప్రతి తెల్ల రేషన్ కార్డు కుటుంబానికి రూ. 5 లక్షల బీమా భరోసా**
- **భూమి లేని నిరుపేదలకు కూడా ఆర్థిక భద్రత**



**శ్రీరంగాపూర్, నవంబర్ 21 (జనంసాక్షి):** శ్రీరంగాపూర్ గ్రామపంచాయతీలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సర్పంచ్ ముంత మద్దిలేటి యాదవ్ లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ముంత మద్దిలేటి యాదవ్ మాట్లాడుతూ, గతంలో భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతు బీమా పథకం వర్తించేదని, భూమి లేని నిరుపేద కుటుంబాలకు అలాంటి ఆర్థిక భద్రత ఉండేది కాదని పేర్కొన్నారు.
ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి జీవిత బీమా భరోసా కల్పించాలనే సంకల్పంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు.ఉప సర్పంచ్ ఖాజా మాట్లాడుతూ, కుటుంబానికి అండగా నిలిచే కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినా, ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా ప్రభుత్వం అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు తమ వివరాలను గ్రామపంచాయతీ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు విష్ణు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని, ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచామని తెలియజేశారు.
శ్రీరంగాపూర్ టౌన్ అధ్యక్షుడు కుమ్మరి గోవిందు మాట్లాడుతూ, అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు అందించడంతో పాటు దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ నాయకులు గంగాధర్, బహుజన రమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గోర్ మెలావో-2026 ను విజయవంతం చేయాలి

- **గోర్ సిక్వాడ ప్రెసిడెంట్ విట్టల్ నాయక్**



**కొల్చారం, నవంబర్ 21(జనంసాక్షి):** మెదక్ జిల్లా కొల్చారం మండలం వాసు రామ్ తండా ఆతిథ్యంలో ఈనెల 24,25 తేదీలలో ఆల్ ఇండియా బంజారా మేలా నిర్వహించనున్నట్లు సర్పంచ్ వినోద్ నాయక్ తెలిపారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. బంజారాలను ఏకతాటిపైకి తీసుకురావడం, వారి సంస్కృతిని కాపాడటమే సమ్మేళనం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో గోర్ సిక్వాడా ప్రెసిడెంట్ విట్టల్ నాయక్, గోర్ సేన ప్రెసిడెంట్ జగన్ నాయక్, లక్ష్మణ్ నాయక్ ,రామ్ నాయక్, జవహర్ నాయక్, మెట్టు నాయక్, రాజు, అంబర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



**అమరచింత, నవంబర్ 21 (జనంసాక్షి):** వ్యవసాయ కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం తహసిల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకుడు అబ్రహం మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు రోజుకు రూ.700 వేతనం, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.39 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించాలని, భూమిలేని కూలీలకు ఇందిరమ్మ భరోసా కింద రూ.12 వేలు అందించాలని కోరారు. మహిళలకు నెలకు రూ.2,500, ఉపాధి కూలీలకు ఏడాదికి 200 పని దినాలు, రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, ఎర్రన్న, వల్లియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## గొల్లత్తగుడి జైన ఆలయాన్ని సందర్శించిన విద్యార్థులు



**జడ్చర్ల, నవంబర్ 21 (జనంసాక్షి):** ప్రపంచ వారసత్వ వారోత్సవాల సందర్భంగా జడ్చర్ల మండలం అల్వన్‌పల్లిలోని గొల్లత్తగుడి జైన ఇటుక దేవాలయాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. గ్రామ సర్పంచ్ కె.ఎస్. దాస్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ చరిత్ర, ప్రాచీన నిర్మాణ శైలి, జైన మత వారసత్వం, పురావస్తు అవశేషాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారసత్వ సంపదను భావితరాలకు పరిరక్షించాల్సిన ఆవశ్యకతను వివరించినట్లు సహాయ సంచాలకులు వి. నాగలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాఘవులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరేపల్లిలో ఇసుక సీజ్..



**పాపన్నపేట, నవంబర్ 21 (జనంసాక్షి):** అనుమతి లేని ఇసుక నిల్వలను సీజ్ చేసినట్లు తహసీల్దార్ సతీష్ కుమార్ తెలిపారు. పక్కా సమాచారంతో శనివారం ఆరేపల్లి గ్రామ శివారులో రెవెన్యూ,పోలీస్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. మంజీరా నది పరివాహక 4 ప్రాంతాల్లో సుమారు 50 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. రెవెన్యూ ఆర్ఐ శరత్ తదితరులు ఉన్నారు.

## కార్మికురాలిపై దాడిని ఖండిస్తూ నిరసన



**జడ్చర్ల, నవంబర్ 21 (జనంసాక్షి):** నల్గొండ మున్సిపాలిటీ 45వ డివిజన్ పారిశుద్ధ్య కార్మికురాలు చందుపట్ల రమణమ్మపై ఇంటి మట్టిని తొలగించలేదని బాలకృష్ణ అనే వ్యక్తి కర్రతో దాడి చేయడాన్ని నిరసిస్తూ శనివారం జడ్చర్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. సిఐటియు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు పట్టణ ఉపాధ్యక్షురాలు అంజమ్మ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆకుల వెంకటేష్ మాట్లాడుతూ నిందితుడిని అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కృష్ణ, విద్యాసాగర్, మహేష్, రమేష్, వెంకటమ్మ, బాలమ్మ, యాదమ్మ, రసూల్ బీ, లక్ష్మమ్మ, కేశవులు, వెంకటయ్య, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

## మునిపల్లిలో ఘనంగా ఇంగ్లీష్ ఒలింపియాడ్ పోటీలు



**మునిపల్లి, నవంబర్ 21 (జనంసాక్షి):** ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మునిపల్లి మండలం కంకోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఇంగ్లీష్ ఒలింపియాడ్ పరీక్షతో పాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన సీనియర్ విభాగంలో అస్మా, జూనియర్ విభాగంలో జి.అక్షిత ప్రథమ స్థానాలు సాధించారు. వక్తృత్వ పోటీల్లో సీనియర్ విభాగంలో జి.రుక్షిత, జూనియర్ విభాగంలో రూకియా బేగం ప్రథమ స్థానాలు పొందారు. విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తుకారాంతో పాటు ఉపాధ్యాయులు పెద్దాపురం దుర్గయ్య, ఉమేష్, అనురాధ, హేమలత, ఎస్తేర్, వెంకటేశ్వర్ రాజు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో ప్రముఖులు



**పాపన్నపేట, నవంబర్ 21 (జనంసాక్షి):** కుర్తివాడ గ్రామానికి చెందిన జర్నలిస్టు మధుసూదన్ చారి శోభారాణి కుమార్తె వివాహానికి ప్రముఖులు హాజరయ్యారు. శనివారం కొత్తపల్లి లోని ఓ వేడుక మందిరంలో జరిగిన వివాహానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి,టివైజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డా.తనుగుల జితేందర్ రావు విచ్చేసి నూతన వధూవరులను వైష్ణవి, సురేష్ చారీలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా రిపోర్టర్లు, నాయకులు ఉన్నారు.

# పేదల ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన మహనీయుడు పండుగ సాయన్న

### ముదిరాజ్‌లతో పాటు అన్ని పేద వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి జూపల్లి



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 21 (జనంసాక్షి):** పేదల కష్టాలను తన కష్టాలుగా భావించి, వారి ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన మహనీయుడు పండుగ సాయన్న అని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామంలో పండుగ సాయన్న విగ్రహాన్ని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, బిత్తిరి సత్తి పాల్గొన్నారు.



**ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ..** ఎన్ని అవరోధాలు ఎదురైనా పేదల పక్షాన నిలిచి పోరాడిన ఆయన జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పండుగ సాయన్న విగ్రహం కేవలం ఒక ప్రతిమ మాత్రమే కాదని, పేదల ఆత్మగౌరవానికి, హక్కుల కోసం సాగిన పోరాటానికి ప్రతీక అని మంత్రి అన్నారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జ్యోతిబా ఫూలే, పండుగ సాయన్న వంటి మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలోని పేదల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ముదిరాజ్ సమాజం ఎన్నో ఏళ్లుగా చేసిన కృషి, ఎదుర్కొన్న అడ్డంకులు, అవమానాల అనంతరం సాధిస్తున్న పురోగతి అభినందనీయమని జూపల్లి కృష్ణారావు అన్నారు. ముదిరాజ్‌లతో పాటు మత్స్యకార వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బీసీ వర్గీకరణపై వస్తున్న అభ్యర్థనలను న్యాయబద్ధంగా పరిశీలించి, విద్యా, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు మెరుగుపడేలా కృషి చేస్తామని తెలిపారు. చెరువులు, రిజర్వాయర్లపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు చేపల పెంపకంతో పాటు కోల్డ్ స్టోరేజీ, ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకింగ్, మార్కెటింగ్ వంటి సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ సదుపాయాలు అందుబాటులోకి వస్తే చేపలకు మెరుగైన ధర లభించడంతో పాటు మత్స్యకారుల ఆదాయం పెరుగుతుందని అన్నారు. ఈ ప్రాంతంలో మత్స్య రంగ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. ప్రతి కుటుంబం పిల్లల విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. మన నిజమైన ఆస్తి మన పిల్లలు వారి ఆస్తి చదువు అని పేర్కొంటూ, అప్పులు చేసి అనవసర ఖర్చులకు దూరంగా ఉండాలని, కుటుంబ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆర్థిక నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. పండుగ సాయన్న ఆశయాలకు అనుగుణంగా పేదల కష్టాల్లో భాగస్వాములై, గ్రామాల అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలని జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు.





ముదిరాజ్ సోదరులకు, మత్స్యకారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి

### అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా భరోసా



**కల్వకుర్తి, నవంబర్ 21 (జనంసాక్షి):** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటించి, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నారు. ప్రజల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నమాల ఆనంద్ కుమార్, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## మహిళలు స్వయం శక్తితో ఎదగడమే మిల్లీ అసోసియేషన్ లక్ష్యం

- **కుట్టు శిక్షణ పూర్తి చేసిన 44 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేత**



**కొల్చారం, నవంబర్ 21 (జనంసాక్షి):** మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలన్నదే మెదక్ మిల్లీ అసోసియేషన్ లక్ష్యమని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఉమర్ ఖాన్, జనరల్ సెక్రటరీ సోఫీ సుజాత అలీ, సభ్యులు రియాజ్ తెలిపారు. శనివారం కొల్చారం బాబా గార్డెన్స్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు నెలలుగా నిర్వహించిన కుట్టు శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసిన 44 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.



మహిళలు స్వయంగా కుట్టిన దుస్తులను ప్రదర్శించారు. కులమతాలకు అతీతంగా శిక్షణ అందించడం అభినందనీయమని మహిళలు పేర్కొన్నారు. భవిష్యత్తులో మెహందీ డిజైన్ శిక్షణ కూడా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, సెంటర్ ఇన్‌చార్జి సానియా సమీరా, హైమది బేగం తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ



**న్యాల్‌కల్, నవంబర్ 21 (జనంసాక్షి):** ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం ఆదేశాల మేరకు మండలంలో డిజిటల్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. శనివారం మండలంలోని ఖలీల్ పూర్ (మల్కాపూర్) గ్రామంలో లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను అందజేశారు. గ్రామ సర్పంచ్ వెంకటేశం అధ్యక్షతన జరిగిన పంపిణీ కార్యక్రమంలో.. గ్రామానికి చెందిన 357 కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్, జిపిఓ గోపాల్, ఉపసర్పంచ్ దేవదాస్, గ్రామస్తులు ప్రభాకర్ రెడ్డి, తుక్కున్న, రాజేంద్ర సాగర్, శ్రీనివాస్, యోహాన్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వృద్ధులకు వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలి

### బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సంజీవ్ రావ్ పాటిల్



**సిర్గాపూర్ నవంబర్ 21 (జనంసాక్షి):** మండలంలోని వృద్ధులకు, బోధకాలు ఉన్నవారికి వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సంజీవ్ రావ్ పాటిల్ కోరారు.ఈ మేరకు ఎంపీడీఓ ఆండాలమ్మకు వినతిపత్రం అందజేశారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

# గ్రామీణ యువతకు ఉచిత సాంకేతిక శిక్షణ

## కల్వకుర్తిలో డిసెంబర్ 1 నుంచి సుంకిరెడ్డి స్కిల్ ఫ్యాక్టరీ ప్రారంభం




**కల్వకుర్తి, నవంబర్ 21 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఉచిత శిక్షణ అందించేందుకు కల్వకుర్తిలో సుంకిరెడ్డి స్కిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నారు.ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, టాస్క్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చొరవతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. డిసెంబర్ 1 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. కల్వకుర్తిలోని తహసీల్దార్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న పాత కృష్ణవేణి జూనియర్ కళాశాల భవనంలో కంప్యూటర్ ప్రయోగశాల సదుపాయంతో ఉచిత శిక్షణ అందించనున్నారు. కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, జావా ఫుల్‌స్టాక్, పైథాన్, ఎస్‌క్యూఎల్, డిజిటల్ మార్కెటింగ్, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, జీఎస్టీ, ట్యాలీ తదితర కోర్సులను బోధించనున్నారు.

శిక్షణతో పాటు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాల అభివృద్ధి, ఇంటర్న్‌షిప్‌లకు సన్నద్ధత, ఉద్యోగ అవకాశాల కల్పనకు మార్గదర్శకత్వం అందించనున్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లొమా విద్యార్థులతో పాటు నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు.గ్రామీణ యువత ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆధునిక సాంకేతిక విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. **సంప్రదించాల్సిన నంబరు:** 6300 553 467

# నవంబర్ 26న డిండి చింతపల్లిలో రాజ్యాంగ దినోత్సవ సభ

- **రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలి**



**ఉప్పునుంతల, నవంబర్ 21 (జనంసాక్షి):** భారత రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ లక్ష్యంగా నవంబర్ 26న డిండి చింతపల్లిలో రాజ్యాంగ దినోత్సవ సభ నిర్వహించనున్నట్లు ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు బొల్లె జగన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి ప్రాథమిక విలువలను అందించిందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రజాస్వామ్య విలువలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలు, మేధావులు, ప్రసంగకర్తలు, సాంస్కృతిక కళాకారులు సభలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆట, పాట, మాట కార్యక్రమాల ద్వారా అంబేద్కర్ ఆశయాలు, రాజ్యాంగ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. నవంబర్ 26 గురువారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డిండి చింతపల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామ పెద్దలు, యువత, మహిళలు, ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బొల్లె జగన్ కోరారు.

# ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలు



**నారాయణపేట, నవంబర్ 21 (జనంసాక్షి):** ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మత్స్యకారుల సహకార సంఘాల చైర్మన్, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు ఎ. కాంత్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారులకు శుభాకాంక్షలు తెలిపారు. సమాజానికి పోషకాహారం అందిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థలో మత్స్యకారులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాలోని చెరువులు, కుంటలు, జలాశయాలకు నీటి లభ్యత పెరిగితే మత్స్యరంగం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రోహు, కట్ల, మృగాల వంటి దేశీయ చేపల పెంపకాన్ని ప్రోత్సహించాలని, చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు, ఆధునిక హ్యాచరీలు, మార్కెటింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని కోరారు. మత్స్యకార సహకార సంఘాలను బలోపేతం చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. యువతకు ఆధునిక చేపల పెంపకంపై శిక్షణతో పాటు రవాణా వాహనాలు, కోల్డ్ స్టోరేజ్ సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, మత్స్యశాఖ అధికారి రెహమాన్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరఫ్ నాగరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మత్స్యకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీ బాలికల వసతి గృహ విద్యార్థినులకు నిత్యావసర వస్తువుల పంపిణీ



**కోహిర్, నవంబర్ 21 (జనంసాక్షి):** కోహిర్ ఎస్సీ బాలికల వసతి గృహంలోని 50 మంది విద్యార్థినులకు రెండో వార్డు కౌన్సిలర్ ఎన్. సంపత్ కుమార్ నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, మగ్గులు, స్పూన్లు, ఉన్ని దుప్పట్లు, బూట్లు, సాక్సులు అందజేశారు. విద్యతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అనిత, వార్డెన్ లలిత పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో భావాలను వ్యక్తపరచాలి



**నంగునూరు, నవంబర్ 21 (జనంసాక్షి):** విద్యార్థులు ఆంగ్లభాషా నైపుణ్యాలతో పాటు ఆత్మవిశ్వాసం, వక్తృత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎంఈఓ తగిరెడ్డి దేశిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ సూచించారు. శనివారం నంగునూరులో మండల ఆంగ్ల భాషా ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఆంగ్ల భాషా ఒలింపియాడ్, టెడ్–ఎడ్ ప్రసంగ పోటీలు నిర్వహించారు. సీనియర్ ఒలింపియాడ్‌లో హర్షితారెడ్డి, రిత్విక్, జూనియర్ విభాగంలో రిషివర్ధన్ రెడ్డి, భవాని విజేతలుగా నిలిచారు. ప్రసంగ పోటీల్లో సీనియర్లుగా మనోజ్ఞ, అక్షిత, జూనియర్లుగా నిత్యారెడ్డి, నిఖిల ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. విజేతలను అతిథులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



**కౌడిపల్లి, నవంబర్ 21 (జనంసాక్షి):** మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో శనివారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకుని నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం రూ. 4.08 లక్షల విలువైన 13 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కౌడిపల్లి పదో వార్డుకు రెండు చెక్కులు మంజూరు చేయించిన వార్డు సభ్యుడు మంగలపర్తి సందీప్ కుమార్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రామా గౌడ్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆటో - బైక్ ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

- **108 అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు**



**చిన్నంబావి, నవంబర్ 21 (జనంసాక్షి):** చిన్నంబావి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో టాటా ఏసీ ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో పెద్దదగడ గ్రామానికి చెందిన చంద్రమోహన్ (46) తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన కుడికాలు, కుడిచేయికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే అటుగా వెళ్తున్న స్థానికులు స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే చిన్నంబావి మండల కేంద్రంలోని 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన చంద్రమోహన్‌కు ప్రాథమిక సహాయం అందించి, మెరుగైన వైద్యం నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా అంబులెన్స్ సిబ్బంది రాఘవేంద్ర, టెక్నీషియన్ నరేందర్ వివరాలు వెల్లడించారు.



## నేడు హద్నూర్ లో..”సదర్ సమ్మేళనం”..!

- **డిఎస్పి, సీఐకి ఉత్సవ నిర్వాహకుల ఆహ్వానం**



**న్యాల్‌కల్, నవంబర్ 21 (జనంసాక్షి):** మండలంలోని హద్నూర్ గ్రామంలో.. సదర్ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ నిర్వాహకులు, భక్త మండలి భారీ ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఈ నెల 22, ఆదివారం సాయంత్రం చేపట్టనున్న కార్యక్రమానికి జహీరాబాద్ డిఎస్పి సైదా నాయక్, జహీరాబాద్ రూరల్ సిఐ నర్సింలు, స్థానిక ఎస్సై సుజిత్‌లను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు గరుడ బృందం ఆధ్వర్యంలో జరగనున్న సదర్ సమ్మేళన మహా కార్యక్రమం గ్రామంలోని జై గణేష్ ముఖద్వారం నుండి గ్రామంలోని ప్రధాన కూడలీలు, రోడ్డు మార్గాన శోభయాత్ర కొనసాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జై గణేష్ ముఖద్వారం నుండి అల్లాదుర్గం – మెటల్ కుంట రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ వరకు భక్తిశ్రద్ధలతో మహా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి గ్రామానికి చెందిన భక్తులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సదర్ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్సవ నిర్వాహకులు కోరారు. ఈ మేరకు శనివారం ఉదయం నిర్వాహకులు డిఎస్పి, సీఐ, ఎస్ఐలకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.




## పోగొట్టుకున్న పర్సును బాధితురాలికి అందజేసిన పేట పోలీసులు



**నారాయణపేట, నవంబర్ 21(జనంసాక్షి):**నారాయణపేట పట్టణంలో పోగొట్టుకున్న పర్సును సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గుర్తించి బాధితురాలికి తిరిగి అందజేశారు. నారాయణపేట పోలీసులు. దామరగిద్ద మండలం, లోకుర్తి గ్రామానికి చెందిన గాయత్రి అనే మహిళ నారా యణపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగే కార్య క్రమానికి హాజరయ్యేందుకు వచ్చారు. ఈ క్రమంలో బస్టాండ్ నుంచి ఫంక్షన్ హాల్‌కు వెళ్లే మార్గమధ్యలో ఆమె పర్సు పోగొట్టుకున్నారు. ఆ పర్సులో రెండు సెల్‌ఫోన్లు, బంగారు గొలు సు, నగదు ఉన్నాయి. వెంటనే బాధితురాలు నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేయగా, ఆయన ఆదేశాల మేరకు మహిళా ఎస్ఐ గాయత్రి నారాయణపేట పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోగొట్టుకున్న పర్సును గుర్తించి బాధితురాలికి తిరిగి అందజేశారు. తన విలువైన వస్తువులు తిరిగి లభించడంతో బాధితురాలు గాయత్రి ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తమ విలువైన వస్తువులు పోగొట్టు కున్నప్పుడు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల కొరడా

- మూడు ట్రాక్టర్లు పట్టివేత



**కల్వకుర్తి, నవంబర్ 21 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం లింగసానిపల్లి గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై కురుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ రవాణాపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు తొగర్‌పల్లి విద్యార్థి



**కొండాపూర్, నవంబర్ 21 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం తొగర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గంగయోళ్ల దేవి ప్రసాద్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈ అవకాశం దక్కించుకున్నాడు. ఈ నెల 23 నుంచి 25 వరకు భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే అండర్-17 బాలుర తెలంగాణ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నాడు. విద్యార్థి ఎంపికపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలోనూ రాణించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలి



**హత్నూర, నవంబర్ 21 (జనంసాక్షి):** ప్రతి ఒక్కరూ మూఢనమ్మకాలను విడనాడి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక మండల కోఆర్డినేటర్ గౌసొద్దీన్ అన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మండలస్థాయి చెకుముకి విజ్ఞాన శాస్త్ర ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఇందులో జెడ్పీహెచ్‌ఎస్ కాసాల, సిరిపుర, కేజీబీవీ బాలుర, టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ హత్నూర పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 30న ఐఐటీ హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలు




**శివ్వంపేట, నవంబర్ 21 (జనంసాక్షి):** ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ఇందిరాపార్క్ మత్స్యకారుల భవన్ వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర డైరెక్టర్ మురళీకృష్ణతో కలిసి గంగపుత్రులు పాల్గొని మత్స్యకారుల సమస్యలు, అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో గంగపుత్ర రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు మాదరబోయిన నర్సయ్య, ఉపాధ్యక్షుడు రాచకట్ల శంకర్, బండారి గంగాధర్, లక్ష్మణ్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్‌పూర్ లోని అక్రమ మైనింగ్ పై పోలీసుల మెరుపు దాడి

- చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు తప్పవు
- జహీరాబాద్ డిఎస్పి సైదా నాయక్ హెచ్చరిక



**న్యాల్‌కల్, నవంబర్ 21 (జనంసాక్షి):** "జాతీయ పెట్టుబడులు – ఉత్పాదకమండలి", నిమ్జ్ ప్రాజెక్టులో భాగంగా.. నిమ్జ్ భూ నిర్వాసితులకు ఈ పాటికే నష్టపరిహారం అందించి, స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూముల్లో.. కొందరు వ్యక్తులు అక్రమంగా మైనింగ్ దందాను కొనసాగిస్తున్నారని, పలుమార్లు దాడులు చేసి, పలు వాహనాలు, యంత్రాలను స్వాధీనం చేసుకున్న ఫలితం లేకుండా పోయిందని అందుకు బాధ్యులైన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిమ్జ్ ప్రాజెక్టు ఉన్నతాధికారులు పోలీసులకు ఆదేశించారు. ఇటీవల రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ వీరారెడ్డి ఐఏఎస్, నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశం, ఎస్పీ పరితోష్ పంకజ్ ల ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున జహీరాబాద్ డిఎస్పి సైదా నాయక్, జహీరాబాద్ గ్రామీణ వలయాధికారి నర్సింలు, స్థానిక ఎస్సై సుజిత్, పోలీస్ బృందంతో కలిసి దాడులు చేశారు. సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, గణేష్ పూర్ గ్రామ శివారులో అక్రమంగా కొనసాగుతున్న మైనింగ్ ప్రదేశం (ఎర్రరాళ్ల తవ్వకం)లో తెల్లవారు జామున దాడులు చేశారు. దాదాపు రెండు గంటలకు పైగా మైనింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు.



**అక్రమ మైనింగ్ అనుమానితులకు డిఎస్పి కౌన్సిలింగ్...**

ప్రభుత్వ అనుమతులు పొందకుండా, ప్రభుత్వ, ప్రవేట్ భూముల్లో అక్రమంగా మైనింగ్ (ఎర్ర రాయి తవ్వకాలు) చేపట్టడం చట్ట విరుద్ధమని డిఎస్పి సైదా నాయక్ హెచ్చరించారు. మైనింగ్ కొనసాగిస్తున్న పలువురు అనుమానితులను స్థానిక పోలీస్ స్టేషన్ కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కేసులు తప్పవని అనుమానితులకు డిఎస్పి హెచ్చరించారు.

## పొగమంచు పట్ల అప్రమత్తంగా ఉండాలి

### వాహనదారులు వేగం తగ్గించి సురక్షితంగా ప్రయాణించాలి: ఎస్సై సోమేశ్వరి



**కొండాపూర్, నవంబర్ 21 (జనంసాక్షి):** శీతాకాలం ప్రారంభం కావడంతో ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంటున్న నేపథ్యంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని కొండాపూర్ ఎస్సై సోమేశ్వరి సూచించారు. పొగమంచు సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాహనదారులు వేగం తగ్గించి, లైట్లు వినియోగిస్తూ ముందున్న వాహనానికి తగిన దూరం పాటించాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఓవర్‌టేక్ చేయవద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్ల డ్రైవర్లు సీటు బెల్టు ధరించాలని తెలిపారు. వాహనాల బ్రేకులు, లైట్లు తనిఖీ చేసుకోవాలని, పొగమంచు తీవ్రంగా ఉన్నప్పుడు సురక్షిత ప్రదేశంలో ఆగాలని కోరారు. ప్రయాణం కంటే ప్రాణం ముఖ్యమని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

## ఇందిరమ్మ జీవిత భీమా.. ప్రతి కుటుంబానికి భీమా!

- సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు మణిదీప్




**హత్నూర, నవంబర్ 21 (జనంసాక్షి):** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు చార్ల మణిదీప్ అన్నారు. మండలంలోని లింగాపూర్ గ్రామంలో శనివారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకంపై అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం తప్పనిసరిగా భీమా చేయించుకోవాలని సూచించారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమాకు సంబంధించిన బ్యానర్ ను ప్రదర్శిస్తూ దాని ప్రయోజనాలను ప్రజలకు వివరించారు.అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం భీమా పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు.

## రహదారి పైన ధాన్యాన్ని ఆరబెట్టొద్దు : ఎస్సైజె.నరేష్ కుమార్



**వీపనగండ్ల, నవంబర్ 22(జనంసాక్షి):** వీపనగండ్ల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు తమ పంట పొలాల వరి ధాన్యాన్ని రహదారుల పైన ఆరపెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. వరి ధాన్యం కోతల సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టవద్దని సూచించారు. రహదారులపై ధాన్యం ఆరబెట్టడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో ధాన్యం కుప్పలు,రాళ్లు, కట్టెలు అడ్డుగా ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు.రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టడానికి ఇతర స్థలాలను ఉపయోగించుకోవాలని సలహా ఇచ్చారు.

## పెద్దపల్లిలో ఘనంగా మత్స్యకారుల దినోత్సవం



**మల్దకల్, నవంబర్ 21 (జనంసాక్షి):** ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పెద్దపల్లి గ్రామంలో శనివారం మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరసింహ, సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నీటి నిల్వలు పరిశీలించేందుకు వెళ్లి ఆపరేటర్ మృతి



**మహమ్మదాబాద్, నవంబర్ 21 (జనంసాక్షి):** మిషన్ భగీరథ నీటి ట్యాంకులో నీటి నిల్వలు పరిశీలించేందుకు వెళ్లిన ఆపరేటర్ ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన మహమ్మద్ మసూద్ మిషన్ భగీరథ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం గువ్వనిగుంట అనుబంధ బోరింగ్ తండాకు నీటి సరఫరా చేసేందుకు వెళ్లి ట్యాంకుపై నీటి నిల్వలను పరిశీలిస్తుండగా రైలింగ్ విరిగి కిందపడ్డాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు.

## ఎల్-నినో ప్రభావాలపై రైతులకు అవగాహన



**నర్సాపూర్, నవంబర్ 21 (జనంసాక్షి):** నర్సాపూర్ మండలంలోని అద్మాపూర్, జక్కపల్లి గ్రామాల్లో ఎల్-నినో ప్రభావాలు, నీటి సంరక్షణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి దీపిక మాట్లాడుతూ.. ఎల్-నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడంతోపాటు పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించాలని, వరి సాగును తగ్గించి జీరో ప్యాడీ విధానాన్ని ఆచరించాలని సూచించారు. జొన్న, మొక్కజొన్న, పెసర, అలసంద, మినుము, శనగ, నువ్వులు, కుసుమ, పొద్దు తిరుగుడు, ఆవాలు, కూరగాయల వంటి ఆరుతడి పంటల సాగుతో నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు. ఆయిల్‌పామ్ సాగు ద్వారా కలిగే ప్రయోజనాలు, సూక్ష్మ నీటిపారుదల పద్ధతులు, నీటి పొదుపు చర్యలు, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, ఎంపీవో మహమ్మద్ మొజామ్ హుస్సేన్, ఏఈవో రాజశేఖర్, ఏపీవో అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి నిర్లక్ష్యంపై ఆగ్రహం

- నిలిచిపోయిన ఈసీజీ, ఎక్స్-రే సేవలను తక్షణమే పునరుద్ధరించాలి
- గర్భిణుల నుంచి అక్రమ వసూళ్లపై విచారణ జరపాలి
- సూపరింటెండెంట్ ఝాన్సీకి పి వై ఎల్, పి డి ఎస్ యు, ఐ ఎఫ్ టి యు నాయకుల వినతి



**గద్వాల, నవంబర్ 21 (జనంసాక్షి):** స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిలిచిపోయిన ఈసీజీ,ఎక్స్-రే సేవలను తక్షణమే పునరుద్ధరించి పేదలకు మెరుగైన వైద్యం అందించాలని పీవైఎల్, పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు.ఆసుపత్రికి వచ్చే గర్భిణుల నుంచి సిబ్బంది రూ.2 వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అలాగే, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించకుండా ఉద్దేశపూర్వకంగా ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్న వైద్యుల వ్యవహారంపై కఠిన నిఘా ఉంచాలని తెలిపారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ ఝాన్సీకి నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ఆసుపత్రుల ఆధునీకరణలో భాగంగా కోట్లాది రూపాయలతో రకరకాల వైద్య సేవలను ప్రారంభిస్తుంటే, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించడం శోచనీయమని మండిపడ్డారు. కనీస రోగ నిర్ధారణ పరీక్షలు కూడా అందుబాటులో లేకపోవడంతో నిరుపేద రోగులు ప్రైవేట్ డయాగ్నోస్టిక్ కేంద్రాలను ఆశ్రయించి ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఆసుపత్రిలో వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, అవినీతికి పాల్పడుతున్న బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఆసుపత్రి ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దానయ్య, హలీం పాషా, జమ్మిచేడు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## పాత బజారులో
# రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, నవంబర్ 21 (జనంసాక్షి):** పట్టణంలోని పాత బజారు ప్రాంతంలో 6, 7, 21, 22, 23 వార్డుల్లో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి శనివారం విస్తృతంగా పర్యటించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఆయా వార్డుల్లో కలియ తిరుగుతూ సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాత బజారు ప్రాంత అభివృద్ధికి రూ.6 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వెల్లడించారు. నిధులతో త్వరలోనే సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పాత బజారును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు.

## ఆలంపల్లి గ్రామస్తుల వినతికి ఎంఈఓ



**కృష్ణ, నవంబర్ 21(జనంసాక్షి):** కృష్ణ మండలం ఆలంపాల్లిలో ప శిటిలావస్థలో ఉన్న పాఠశాలను శనివారం గ్రామస్థుల వినతి మేరకు మండల విద్యాధికారి సందర్శించారు. గతంలో ఈ బిల్డింగ్ శిథిలావస్థలో ఉందని ఇదివరకే పై అధికా రులకు తెలియజేయడం జరిగిందన్నారు.నేడు మరోసారి శిథిలావస్థలో ఉన్న పాఠశాల ను సంద ర్శించి నిషేధిత ప్రాంతంగా గుర్తించి అంగన్వాడి సిబ్బం దికి,పాఠశాల సిబ్బందికి విద్యార్థులను అటువైపు వెళ్ళకుండా నిషేధిత ప్రాంతంగా గుర్తించి, ఈ విషయాన్ని మరోసారి పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి బిల్డింగ్ నిర్మించడానికి కృషి చేస్తానని విద్యాధికారి తెలిపారు.అలాగే మండలం లో శిటిలావస్తలో ఉన్న పాఠ శాల బిల్డింగ్ లను నిషేధిత ప్రాంతంగా ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, స్పెషల్ ఎడ్యుకేటర్ పాల్గొన్నారు.

## కృష్ణాపూర్‌లో
# ఇంకుడు గుంతకు భూమి పూజ



**కల్వేర్, నవంబర్ 21 (జనంసాక్షి):** కల్వేర్ మండలం కృష్ణాపూర్ గ్రామంలో ఇంకుడు గుంత నిర్మాణం కోసం శనివారం ఘనంగా భూమి పూజ చేయడం జరిగింది.గ్రామంలో కురుస్తున్న వర్షపు నీరు వృథాగా పోకుండా, భూగర్భంలోకి ఇంకించి భూగర్భ జలాలను పెంచేందుకు ఈ ఇంకుడు గుంతను నిర్మిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో గ్రామంలో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు, బోరుబావుల్లో నీటి మట్టం పెరిగేందుకు ఈ గుంత ఎంతో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, నాయకులు సంప్రదాయ బద్ధంగా భూమి పూజ నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు తుకారాం పటేల్ గారు, పంచాయతీ కార్యదర్శి, టీ ఏ బన్సీలాల్, మెట్టు శ్రీనివాస్, విట్టల్, నారాయణ, హన్మంత్ రెడ్డి, నర్సింలు, మల్లయ్య, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, నవంబర్ 21 (జనంసాక్షి):** పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తోందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జడ్చర్ల మున్సిపాలిటీలోని అంబేద్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో జడ్చర్ల పట్టణం, మండలానికి చెందిన 92 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను ఆయన పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేద కుటుంబాలకు ఆడపిల్లల వివాహం భారంగా మారకూడదనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా అందేలా చూస్తున్నామని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నందిగామలో ఘనంగా మత్స్యకారుల దినోత్సవ వేడుకలు



**కొత్తపల్లి, నవంబర్ 21 (జనంసాక్షి):** కొత్తపల్లి మండలం నందిగామ గ్రామంలో శనివారం అంతర్జాతీయ మత్స్యకారుల దినోత్సవాన్ని మత్స్యకారులు ఘనంగా నిర్వహించారు. గ్రామ మత్స్యకారుల సహకార సంఘం సభ్యులు జెండా ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాజంలో మత్స్యకారుల పాత్ర కీలకమని, వారి శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని కోరారు. మత్స్యకారుల ఐక్యతతో సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాస్కర్, నరసింహులు, అంజలయ్య, మనెప్ప, చంద్రప్ప, కృష్ణయ్య, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆంగ్ల భాషా నిఘంటువుల పంపిణీ



**మల్దకల్, నవంబర్ 21 (జనంసాక్షి):** విద్యార్థుల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించి, పదజాలంపై పట్టు సాధించే లక్ష్యంతో మల్దకల్ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 629 మంది విద్యార్థులకు ప్రభుత్వం సరాఫరా చేసిన నిఘంటువులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఇంగ్లీష్-తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువులను అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి జి.సురేష్ మాట్లాడుతూ,విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించడానికి నిఘంటువులు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.ప్రతి విద్యార్థి ప్రతిరోజూ కనీసం ఐదు కొత్త ఆంగ్ల పదాలను నేర్చుకొని, వాటి అర్థాలు, ఉచ్చారణలను తెలుసుకుంటూ, రోజువారీ సంభాషణల్లో ఉపయోగించాలని సూచించారు. నిఘంటువులను కేవలం పుస్తకాలుగా కాకుండా, నిరంతరం జ్ఞానాన్ని అందించే మంచి మిత్రులుగా భావించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించి, చదువులో ఉన్నత శిఖరాలనుఅధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలోఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## 56 మందికి చేయూత
# పింఛన్లు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**మెదక్, నవంబర్ 21 (జనంసాక్షి):** హవేలీ ఘనపూర్ మండలం కూచంపల్లి గ్రామంలో నూతన చేయూత పింఛన్లు, స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్ లింగాల భూదేవి శనివారం పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 56 మంది లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హేమలత, ఉపసర్పంచ్ రేఖ, డీలర్ లింగాల సుధాకర్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అమరచింతలో
# ఇందిరమ్మ బీమా పథకం ప్రారంభం





**అమరచింత, నవంబర్ 21 (జనంసాక్షి):** మున్సిపాలిటీలోని 4, 5, 8వ వార్డుల్లో శనివారం ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించారు. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాలు, టీజీ టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనల మేరకు కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం ద్వారా రూ.5 లక్షల బీమా భరోసా లభిస్తుందని నాయకులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ నూరల్ నజీబ్ మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ జింక సువర్ణ, వైస్ చైర్‌పర్సన్ రాధ, కౌన్సిలర్లు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 లోగో, మస్కట్ ఆవిష్కరణ

## జాతీయ స్థాయి క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి




**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 21 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా ఇండోర్ స్టేడియంలో డిసెంబర్ 17 నుంచి 22 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో పోటీల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు మహబూబ్‌నగర్ ఆతిథ్యం ఇవ్వడం జిల్లా ప్రజలకు గర్వకారణమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోటీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల నిర్వహణతో గ్రామీణ ప్రాంత యువ క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు.

ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 8 బాలుర, 8 బాలికల జట్లు కలిపి మొత్తం 16 జట్లు పాల్గొంటాయని వెల్లడించారు. క్రీడాకారులకు వసతి, భోజనం, రవాణా, భద్రత, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. క్రీడా వేదికతో పాటు క్రీడాకారులు బస చేసే ప్రాంతాల్లోనూ అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. పోటీలపై విస్తృత ప్రచారం కల్పించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు భాగస్వాములు అయ్యేలా చూడాలన్నారు.

అనంతరం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 లోగో, మస్కట్‌ను ఆవిష్కరించారు. సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటోలు దిగారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, శిక్షణ కలెక్టర్ సాయి శివాని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్.పి. వెంకటేష్, డీఆర్ఓ నిర్మల, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీవైఎస్ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గం ద్వారా లోక్ అదాలత్ కేసుల పరిష్కారం

నారాయణపేట జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కోఆర్డినేషన్ మరియు పోలీస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 12న నిర్వహించనున్న నాలుగోవ జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేసేందుకు అన్ని విభాగాల జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కక్షిదారులు లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.

సెప్టెంబర్ 12న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్లో రాజీమార్గం ద్వారా మొత్తం 5,552 కేసులను పరిష్కరించి, నారాయణపేట జిల్లా రాష్ట్రవ్యాప్తంగా 23వ ర్యాంకు సాధించిందని తెలిపారు.

ఈ విజయానికి కృషి చేసిన న్యాయమూర్తులు, పోలీసు అధికారులు మరియు సంబంధిత సిబ్బందిని అభినందించారు. డిసెంబర్ 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ కేసులు, నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ (ఎన్ఐ) యాక్ట్ కేసులు, ఎగ్జిక్యూషన్ పిటిషన్స్ (ఈపీ) కేసులు, సైబర్ నేరాల కేసులు, నాన్-బెయిలబుల్ వారెంట్ ఖైదీలకు సంబంధించిన కేసుల పరిష్కారానికి (ఎన్టీడబ్ల్యూ) కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పరిష్కార ప్రక్రియను యధావిధిగా కొనసాగించాలని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ అండ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ప్రియాంక, సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ డాక్టర్ వినీత్ కుమార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కం సీనియర్ సివిల్ న్యాయమూర్తి వింధ్యానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని ఆరుతడి పంటలు సాగు చేయాలి

- **రైతులకు ఏడీఏ పుణ్యవతి సూచన**



**కౌడిపల్లి నవంబర్ 21 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు తక్కువ నీటితో సాగు చేసుకునే ప్రత్యామ్నాయ పంటలు, ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఏడీఏ పుణ్యవతి సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, వరి వంటి అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా కూరగాయలు, పప్పుధాన్యాలు, జొన్న తదితర ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం మహమ్మద్‌నగర్ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న కూరగాయల పంటలను ఏడీఏ పుణ్యవతి, మండల వ్యవసాయ అధికారి స్వప్న, వ్యవసాయ విస్తరణ అధికారి నరేందర్, సందర్శించి పంటల సాగు విధానాలపై రైతులకు పలు సూచనలు చేశారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేలా పంటల వైవిధ్యీకరణ చేపట్టాలని తెలిపారు. ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించేందుకు జొన్న రకం సీఎస్‌వీ-41 విత్తనాలను కౌడిపల్లి మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని ఏడీఏ పుణ్యవతి కోరారు.

# కల్హేర్ పల్స్ పోలియోకు సర్వం సిద్ధం



**కల్హేర్, నవంబర్ 21 (జనంసాక్షి):** కల్హేర్ మండల పరిధిలో ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని మండల వైద్యాధికారిణి డాక్టర్ జెబా షహమీన్ తెలిపారు.మండలంలోని ఏడాది నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు సుమారు 2,200 మందికి పోలియో చుక్కలు వేసేందుకు 20 బూత్ లను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ప్రతి బూత్ వద్ద ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటారని చెప్పారు.ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు మండలాన్ని రెండు రూట్లుగా విభజించి పర్యవేక్షణ చేపడతామన్నారు. బూత్ లకు రాలేని చిన్నారుల కోసం సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా డాక్టర్ జెబా షహమీన్ మాట్లాడుతూ పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్క చిన్నారికి చుక్కలు వేయడం తప్పనిసరి అని అన్నారు. గతంలో పోలియో చుక్కలు వేసినప్పటికీ, ఈ విడతలో కూడా తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎవరైనా చిన్నారులు మిగిలిపోతే వెంటనే ఆశా కార్యకర్తలకు తెలియజేయాలని కోరారు.ప్రజలు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# కారు దిగి.. కమలంలోకి!

- **కాషాయ తీర్థం పుచ్చుకున్న నవాబ్ పేట సర్పంచి**



**హత్నూర, నవంబర్ 21 (జనంసాక్షి):** మండలంలోని నవాబ్ పేట గ్రామ సర్పంచి ఎరుకలి బుచ్చయ్య శనివారం వార్డు సభ్యులతో కలిసి బిజెపి పార్టీలో చేరారు.ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా బరిలో దిగి సర్పంచిగా ఎన్నికయ్యారు.పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది కూడా పూర్తి గాకుండానే వారంతా బిజెపి పార్టీ మండలాధ్యక్షుడు నాగ ప్రభు గౌడ్ ఆధ్వర్యంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో కమలం గూటికి చేరారు.ఈ సందర్భంగా ఎంపీ వారికి కాషాయం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్,వార్డు సభ్యులు మల్లేశం,నరెందర్, శివశంకర్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## ప్రతి కుటుంబానికి
# రూ.5 లక్షల బీమా భరోసా

- **తాండ్రలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం**



**కల్వకుర్తి, నవంబర్ 21 (జనంసాక్షి):** కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామంలో సర్పంచ్ ఆశాదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల బీమా అందుతుందని ఆమె తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల వయసున్న వారందరూ అర్హులని, గ్రామపంచాయతీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, రైతులకు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిలీల, ఉపసర్పంచ్ సరిత, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో
# 11 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- **ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ**
- **జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికిరణ్ రెడ్డి**

**సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 21(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లాలోని హత్నూర, పటాన్‌చెరు, సంగారెడ్డి పారిశ్రామిక శిక్షణ సంస్థలతో పాటు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఖాళీగా ఉన్న 11 పోస్టులను అవుట్‌సోర్సింగ్, ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికిరణ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శనివారం వెల్లడించారు.

అవుట్‌సోర్సింగ్ విధానంలో 3 కార్యాలయ సహాయకులు, 3 స్వీపర్లు, 3 కాపలాదారుల పోస్టులు, ఒప్పంద పద్ధతిలో 2 బహుళ ప్రయోజన కార్మికుల పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలని, ఎంపికైన వారికి నెలకు రూ.15,600 వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు.

# వరికోత అనంతరం వరిగడ్డిని కాల్చవద్దు



**కౌడిపల్లి నవంబర్ 21 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో వరిపంట కోత అనంతరం రైతులు పొలాల్లో మిగిలిన పంట అవశేషాలు (వరిగడ్డి) కాల్చవద్దని ఏడీఏ పుణ్యవతి సూచించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించడంతో పాటు భూమి సారం తగ్గిపోతుందని, పర్యావరణం కలుషితమవుతుందని ఆమె తెలిపారు. పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్నడం లేదా కంపోస్టుగా తయారుచేసి సేంద్రియ ఎరువుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. ఇలా చేయడం వల్ల నేలలో సేంద్రియ కర్బనం పెరిగి భూసారం మెరుగుపడుతుందని వివరించారు. అంతేకాకుండా పంట అవశేషాలను పశువుల మేతగా, ఇతర వ్యవసాయ అవసరాలకు కూడా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల వెలువడే పొగ గాలి కాలుష్యానికి కారణమవడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. రైతులు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పంట అవశేషాల నిర్వహణపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి స్వప్న, ఏఈఓ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థిని నేహా బేగంకు అండగా ఎమ్మెల్యే మేఘారెడ్డి

## ప్రభుత్వ హాస్టల్ వసతితో పాటు ల్యాప్‌టాప్ అందజేసిన ఎమ్మెల్యే

**వనపర్తి బ్యూరో, నవంబర్ 21 (జనంసాక్షి):** వనపర్తి పట్టణం 2వ వార్డుకు చెందిన పేద ముస్లిం విద్యార్థిని నేహా బేగం ఉన్నత విద్యను అభ్యసించేందుకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ ప్రభుత్వ హాస్టల్‌లో వసతి కల్పించడంతో పాటు, విద్యాభ్యాసానికి అవసరమైన ల్యాప్‌టాప్‌ను కూడా అందజేశారు. స్థానిక కౌన్సిలర్ బి. రమాదేవి చేసిన విజ్ఞప్తికి స్పందించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి విద్యార్థినికి అవసరమైన సహాయాన్ని అందించారు. పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో ఎమ్మెల్యే అందించిన సహాయంపై నేహా బేగం తండ్రి ఇసాక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి మాధవి



రమేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి. కృష్ణ పాల్గొన్నారు.

# ఏ.ఎస్.డీ.డీ ఓటర్లకు మరో అవకాశం: కలెక్టర్ ప్రతీక్ జైన్

- **అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చర్యలు**

**సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 21 (జనంసాక్షి):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఏ.ఎస్.డీ.డీ జాబితాలో ఉన్న అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించి, వారి పేర్లను ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.

శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఏ.ఎస్.డీ.డీ ఓటర్ల గుర్తింపు, ధ్రువీకరణలో బూత్ స్థాయి ఏజెంట్లు, అధికారుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. చిరునామా, ఆధార పత్రాలు లేని నిరాశ్రయుల విషయంలో క్షేత్రస్థాయి పరిశీలన నివేదికలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. ఇప్పటికే ఫారం-6 సమర్పించిన వారు మరోసారి ఎన్యూమరేషన్ ఫారం ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..** జిల్లాలో మొత్తం 2,98,278 మంది ఏ.ఎస్.డీ.డీ ఓటర్లను గుర్తించినట్లు వెల్లడించారు. అర్హులైన వారి పేర్లు పొరపాటున తొలగిపోకుండా మరో అవకాశం



కల్పిస్తున్నామన్నారు. ఇందుకోసం ఎన్యూమరేషన్ ఫారంతో పాటు అనుబంధం-బి, అనుబంధం-సి పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లకు వ్యక్తిగతంగా, ఎస్ఎంఎస్, వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఓటర్లు బూత్ స్థాయి అధికారులను సంప్రదించి అవసరమైన పత్రాలు సమర్పించాలని సూచించారు. జిల్లాలో ఫారం-6, 6ఏ, 7, 8లకు సంబంధించి 11,503 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పి.ఎన్.ఆర్. ఇండోర్ స్టేడియానికి 8 టేబుల్ టెన్నిస్ టేబుళ్లు మంజూరు



- **శశిధర్ రెడ్డి చొరవపై బీఆర్ఎస్వీ హర్షం**

**మెదక్ టౌన్, నవంబర్ 21 (జనంసాక్షి):** మెదక్ జిల్లా క్రీడారంగ అభివృద్ధికి రూ.7.91 లక్షల నిధులు విడుదల కావడం, పి.ఎన్.ఆర్. ఇండోర్ స్టేడియానికి 8 టేబుల్ టెన్నిస్ టేబుళ్లు మంజూరు కావడంపై బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ నిధుల విడుదలకు చొరవ చూపిన మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎలక్ట్రిసిటీ కంట్రోలర్ బోర్డు డైరెక్టర్ శశిధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

ఈ మేరకు బీఆర్ఎస్వీ జిల్లా ప్రధాన కార్యదర్శి కసాపురం కిరణ్ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నప్పటికీ, సరైన పరికరాలు, మౌలిక సదుపాయాల కొరతతో అవకాశాలు పరిమితమవుతున్నాయని పేర్కొన్నారు. 8 టేబుల్ టెన్నిస్ టేబుళ్ల మంజూరుతో స్టేడియంలో సదుపాయాలు మెరుగుపడి, విద్యార్థులకు శిక్షణ పొందే అవకాశం కలుగుతుందన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేందుకు ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడాకారులకు మరిన్ని నిధులు, మెరుగైన శిక్షణ, పరికరాలు కల్పించాలని కోరారు.

# విద్యార్థుల శాస్త్రీయ ప్రతిభకు ప్రోత్సాహం అందించాలి

- **ఉప్పునుంతలలో టాలెంట్ టెస్ట్, చెకుముకి సైన్స్ సంబరాలు**

**ఉప్పునుంతల (జనంసాక్షి):** విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, ప్రతిభను పెంపొందించేందుకు పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం ఆధ్వర్యంలో ఉప్పునుంతల పీఎంఎన్ హెచ్ఆర్ఐ జెడ్పీ ఉన్నత పాఠశాలలో టాలెంట్ టెస్ట్, మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై పుట్ట మహేష్ విజేతలకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. టాలెంట్ టెస్ట్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు ప్రతి తరగతిలో ఇద్దరు చొప్పున విజేతలుగా ఎంపికయ్యారు. చెకుముకి పోటీల్లో ఉప్పునుంతల, పెనిమెల్ల జెడ్పీహెచ్ఎస్‌లు, కేజీబీవీ విద్యార్థులు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ప్రతిభ కనబరిచారు. విద్యతోపాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, ఇలాంటి పోటీలు ఆత్మవిశ్వాసం, పోటీతత్వాన్ని పెంచుతాయని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం నీలా శ్రీధర్, జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# పల్స్ పోలియోకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- **ఐదేళ్లలోపు చిన్నారులందరికీ చుక్కలు వేయించాలి..**
- **వైద్య సిబ్బందికి డీఎంహెచ్ఓ డా.పుట్ల శ్రీనివాస్ ఆదేశం**

**హైదరాబాద్, నవంబర్ 21 (జనంసాక్షి):** పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు.



ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. శనివారం నాంపల్లి క్లస్టర్ పరిధిలోని అఫూపుర పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డా.మురళీధర్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, ప్రయోగశాల, రికార్డులు, పరిశుభ్రతను పరిశీలించారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, గర్భిణులకు అవసరమైన పరీక్షలు, చికిత్సలు క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాలను వందశాతం సకాలంలో పూర్తి చేయాలని, వ్యాక్సిన్ల నిల్వ, శీతలీకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. అర్హులైన బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేయించాలని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. నాన్ కమ్యూనికేబుల్ వ్యాధుల సర్వే, స్క్రీనింగ్, ఫాలోఅప్ ప్రతిరోజూ నిర్వహించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గునియా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఇంటింటి సర్వేలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



# ప్రశ్నించే తత్వమే విజ్ఞానానికి పునాది

- **విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసే వేదిక చెకుముకి టాలెంట్ టెస్ట్**

**కీసర, నవంబర్ 21 (జనంసాక్షి):** విద్యార్థులు ప్రతి అంశాన్ని ప్రశ్నిస్తూ, సమాధానాలు తెలుసుకునే అలవాటు పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు రజినీ సూచించారు. ప్రశ్నించే తత్వమే శాస్త్రీయ ఆలోచనలకు పునాది అని పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక సైన్స్ సంబరాల్లో భాగంగా కీసర మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం నాగారం ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పరీక్ష ప్రశ్నాపత్రాన్ని ఎంఈఓ వెంకట్‌రామ్‌రెడ్డి విడుదల చేశారు.







**ఈ సందర్భంగా రజినీ మాట్లాడుతూ...** విద్యార్థులు పుస్తకాల్లోని అంశాలను కంఠస్థం చేయకుండా, వాటి వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలను తెలుసుకోవాలని సూచించారు. సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని, ఇలాంటి పరీక్షలు శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకతను పెంపొందిస్తాయని తెలిపారు. ఎంఈఓ వెంకట్‌రామ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి చెకుముకి టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందన్నారు. చదువుతోపాటు నిత్యజీవితంలోని అంశాలను పరిశీలించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. నాగారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభ, పోటీతత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. శ్రీనివాస్ విద్యార్థులు చిన్నతనం నుంచే సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.

జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించిన పాఠశాలలు: ప్రైవేట్ విభాగంలో పుడిమి, లోటస్, విజ్ఞాన జ్యోతి పాఠశాలలు; ప్రభుత్వ విభాగంలో నాగారం, కీసర, చీర్యాల పాఠశాలలు; రెసిడెన్షియల్ విభాగంలో బోగారం, కీసర, అంకిరెడ్డిపల్లి పాఠశాలలు అర్హత సాధించాయి. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు తోట శ్రీనివాస్, కోశాధికారి జెన్నీ, మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శేషగిరిరావు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

